సాక్షి
కాకినాడ


శనివారం । 29 । మార్చి । 2025



కల్పవల్లి.. నూకాలమ్మ తల్లి

చింతలూరు నూకాంబిక అమ్మవారి తీర్థ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు సుమారు 20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు.

II లో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సాయంత్రం)	సహర్ ఆదివారం (ఉదయం)
రాజమండ్రి	6.24	4.39
కాకినాడ	6.24	4.38
అమలాపురం	6.24	4.38

న్యూస్‌రీల్

టెన్త్ పరీక్షకు 28,280 మంది హాజరు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన పదో తరగతి బయలాజికల్ సైన్స్ పరీక్షకు 28,280 మంది హాజరయ్యారు. 338 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ 5, తనిఖీ అధికారులు 40 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. కాగా, ఓపెన్ స్కూల్ టెన్త్ విద్యార్థులకు సోషల్, ఎకనామిక్స్ పరీక్షలు నిర్వహించారు. వీటికి 2,024 మంది హాజరవగా 192 మంది గైర్హాజరయ్యారు.

సోషల్ పరీక్ష తేదీ మార్పు

రంజాన్ పర్వదినం కారణంగా ఈ నెల 31వ తేదీన నిర్వహించాల్సిన సోషల్ పరీక్షను ఏప్రిల్ 1వ తేదీకి వాయిదా వేసినట్లు డీఈఓ రమేష్ తెలిపారు. దీనిపై విద్యార్థులకు పాఠశాలల యాజమాన్యాలు సమాచారం అందించాలని సూచించారు.

ఉద్యోగ ప్రకటన రద్దు

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో గత ఏడాది డిసెంబర్ 30న నోటిఫికేషన్ నంబర్ 01/2024తో ఇచ్చిన ఉద్యోగ ప్రకటనను రద్దు చేస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ నరసింహ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్ ద్వారా కాంట్రాక్టు విధానంలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2 (3 పోస్టులు), ఎఫ్ఎన్ఓ (20 పోస్టులు), శానిటరీ అటెండర్ కం వాచ్‌మన్ (38 పోస్టులు) ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల బ్యాంక్ డీడీలను ఉన్నతాధికారుల ఆదేశాల తిరిగి ఇవ్వాలని నిర్ణయించామని వివరించారు. కాకినాడలోని తమ కార్యాలయంలో ఏప్రిల్ 24వ తేదీ వరకూ ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య డీడీలు వాపసు ఇస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ కాపీ ఇచ్చి, దరఖాస్తు సంఖ్య చెప్పి, డీడీలు వెనక్కి తీసుకోవాలని కోరారు. జీఓ నంబర్ 32 ప్రకారం ప్రతి పీహెచ్‌సీకి 14 మంది మాత్రమే సిబ్బంది ఉండాలన్న నిబంధన, కొన్ని క్యాడర్ ఉద్యోగాల విలీనం కారణంగా రేషనలైజేషన్‌లో పోస్టులు అదనంగా గుర్తించడంతో కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ రద్దుకు నిర్ణయం తీసుకున్నామని డీఎంహెచ్ఓ తెలిపారు.

అమలేశ్వరికి వెండి ఆభరణాల సమర్పణ



వెండి ఆభరణాలతో అమలేశ్వరి అమ్మవారు

అమలాపురం రూరల్: మండలం రోళ్లపాలెంలో కొలువైన అమలేశ్వరీ సమేత అమలేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి భక్తులు వెండి ఆభరణాలను సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు రెండులక్షలతో తయారు చేసిన కిరీటం, దండ, హారం, ముక్కుపుడక, కళ్లు, కనుబొమ్మలు తదితరులు ఆభరణాలను వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వాటిని అమ్మవారికి అలకరించారు. హోమం నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమాధనఅధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తాళ్లమ్మకు వెండి, పంచ లోహ పాదాల సమర్పణ

ఆలయ అభివృద్ధికి రూ.4.4 లక్షల విరాళం



తాళ్లమ్మతల్లికి పాదుకలు సమర్పిస్తున్న వీర మణికంఠ

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డిపాలెం గ్రామ దేవత తాళ్లమ్మ తల్లికి భక్తులు వివిధ రూపాల్లో వితరణలు చేశారు. కొండేపూడి గోవిందరాజు, వీర వెంకట అనంతలక్ష్మి దంపతుల కుమారుడు వీర మణికంఠ రూ.2.04 లక్షలతో వెండి, పంచలోహ పాదములు, గరగను చేయించి శుక్రవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు మిద్దే సత్యనారాయణ ద్వారా ఆలయానికి సమర్పించారు. వాటిని ఆలయ ఆసాదు అమ్మవారికి అలంకరించారు. అలాగే ఆలయ ప్రాంతానికి చెందిన విశ్రాంత ఏఎస్ఐ ఏడిద సత్యనారాయణమూర్తి అమ్మవారి అలంకరణకు ఆభరణాలు, ఆలయ అభివృద్ధి నిమిత్తం రూ.1.3 లక్షలు, దెందులూరి వీరభద్రం – భానుతిలకం (మాజీ ఎమ్మెల్యే) దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, ఎస్‌బీఐ విశ్రాంత ఏజీఎం దెందులూరి జగదీశ్వరప్రసాద్ రూ.1.1 లక్షలు, మిద్దే సావిత్రమ్మ, బలరామమూర్తి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు మిద్దే సత్యనారాయణ (ఆలయ కమిటీ ప్రెసిడెంట్), ఆదినారాయణ, శ్రీనివాస్, శ్రీహరి సోదరులు కలిసి రూ.1,00,116, పట్టపు పద్మావతి – తాతారావు దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.1,00,116, విరాళంగా అందచేశారు.

పేదల రేషన్‌పై కూటమి కత్తి

- ఈ- కేవైసీ సాకుతో కోతకు ఎత్తుగడ!
- రేషన్ దుకాణాల వద్ద గంటల తరబడి పడిగాపులు
- మూడు రోజులే గడువు



ఈ-కేవైసీ కోసం పెద్దాపురంలో మండుటెండలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వ్యవసాయాధారితమైన జిల్లాలో రబీ మాసూళ్లు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. రైతులు, వ్యవసాయ కూలీలు క్షణం తీరిక లేకుండా బిజీగా ఉన్నారు. పదో తరగతి, డిగ్రీ పరీక్షలతో విద్యార్థులందరూ పుస్తక పఠనలో మునిగి తేలుతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం అనాలోచితంగా రేషన్ కార్డులకు ఈ-కేవైసీ (ఎలక్ట్రానిక్–నో యువర్ కస్టమర్) చేయించుకోవాలని హడావిడి చేస్తోంది. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి పది నెలలవుతున్నా అర్జీలు పెట్టుకున్న వారికి ఇప్పటి వరకూ కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. పైగా ఉన్న కార్డులకు కత్తెర వేసేందుకు ఎత్తులు వేస్తున్నట్లు జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని, అది కూడా ఈ నెలాఖరులోపు అంటూ గడువు విధించడంతో కార్డుదారులు గగ్గోలు పెడుతున్నారు. గడువుకు మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

సమయమేదీ..!

జిల్లావ్యాప్తంగా 6,43,874 రేషన్ కార్డులున్నాయి. గతంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకున్న వారు 16,36,012 మంది ఉన్నారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ప్రక్రియ 2,01,424 మందికి పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వ ఆదేశాలతో తాజాగా 5,755 మంది ఈ-కేవైసీ చేయించుకున్నారు. జిల్లాలో 620 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. డీలర్ల వద్ద 1,060 ఈ-పోస్ యంత్రాలున్నాయి. ఈ-కేవైసీ చేయించుకునే అవకాశం ఈ రెండుచోట్ల మాత్రమే ఉంది. డీలర్ల వద్ద సర్వర్లతో సాంకేతిక ప్రతిబంధకాలు ఎదురవుతూండటంతో ఈ-కేవైసీ పెద్ద సమస్యగా మారిందని చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 21 మండలాలకు గాను 10 మంది మాత్రమే పౌర సరఫరాల ఉప తహసీల్దార్లు ఉన్నారు. ఈ నెల 20న ఈ-కేవైసీ ప్రారంభించి, 31వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కేవలం 11 రోజుల్లో ఇంత మంది ఈ-కేవైసీ పూర్తి చేయడం ఏవిధంగా సాధ్యమనే ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు.

పిల్లలకూ కష్టాలు

ఐదేళ్ల వయస్సు దాటి, వేలిముద్ర అప్‌డేట్ చేయించుకోని పిల్లలకు ఇప్పుడు ఈ-కేవైసీ పెద్ద సమస్యగా మారింది. వారి వేలిముద్రలు అప్‌డేట్ చేయించేందుకు తల్లిదండ్రులు ఆధార్ సెంటర్ల వద్ద గంటల తరబడి పడిగావులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. మరోవైపు ఐదేళ్ల నుంచి 12–13 ఏళ్లలోపు పిల్లలకు, 70 ఏళ్లకు పైబడిన వృద్ధులకు ఈ-కేవైసీ నమోదు కావడం లేదు. సర్వర్ సమస్య వేధిస్తోందని పదేపదే మొత్తుకుంటున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడని ప్రజలు మండిపడుతున్నారు.

కార్డుల తొలగింపునకు కుట్రేనా?

నిత్యావసర సరకుల పంపిణీలో తేడాలు, అవకతవకలను నివారించేందుకనే సాకుతో రేషన్ కార్డులను తొలగించేందుకే కూటమి సర్కార్ ఈ-కేవైసీ కుట్రకు తెర తీసిందని కార్డుదారులు మండిపడుతున్నారు. రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులందరూ నెలాఖరులోగా తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోకపోతే ఏప్రిల్ నెల సరకులు అందవని రెవెన్యూ అధికారులు చెబుతున్న మాటలతో కార్డుదారుల్లో ఆందోళన నెలకొంది. రేషన్ నిలిపివేస్తారో.. లేక కార్డులను రద్దు చేస్తారోనని వారు మల్లగుల్లాలు పడుతున్నారు. రేషన్ కార్డులు లేకపోతే సంక్షేమ పథకాల్లో కోత తప్పదంటున్న రెవెన్యూ అధికారుల మాటలతో సర్వత్రా ఆందోళన నెలకొంది. పౌర సరఫరాల శాఖ అధికారులు శుక్రవారం నాటి సమీక్షలో ప్రస్తుతానికి ఈ-కేవైసీ చేయించుకోకున్నా రేషన్ ఆపేది లేదని చెబుతున్నా అది ఎంత వరకూ వర్తిస్తుందో తెలియడం లేదనే అనుమానాలు ప్రజల్లో నెలకొన్నాయి.

కొత్త కార్డులకు దిక్కే లేదు

కూటమి సర్కార్ గద్దెనెక్కిన తొమ్మిది నెలల కాలంలో జిల్లావ్యాప్తంగా సుమారు 70 వేల మంది కొత్త రేషన్ కార్డులకు, మరో 40 వేల మందికి పైగా కార్డుల్లో తప్పుల సవరణకు దరఖాస్తులు చేసుకున్నారని చెబుతున్నారు. కొత్త కార్డులు ఇవ్వకపోగా, ఉన్న కార్డులను ఎలా తొలగించాలనే కుట్రలో భాగంగానే ఈ-కేవైసీ డ్రామా మొదలు పెట్టారని అంటున్నారు. ఈ-కేవైసీ నమోదు కాకుంటే ఆ కార్డులోని సభ్యులను తొలగించి రేషన్‌కు కోత పెడతారని అనధికారిక సంభాషణల్లో అధికారులు చెబుతున్నారని కార్డుదారులు ఆందోళన చెదుతున్నారు.

మచ్చుకైనా కనిపించని కంది పప్పు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా కార్డుదారులందరికీ కందిపప్పు సరఫరా చేశారు. అటువంటిది కూటమి సర్కార్ వచ్చాక రేషన్‌తో పాటు కందిపప్పు ఇస్తారనే విషయాన్నే కార్డుదారులు మరచిపోయారు. ఇప్పుడు ఏప్రిల్ నెలలో కూడా కందిపప్పు సరఫరా చేసే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే బియ్యం, పంచదార మండల స్థాయి నిల్వ కేంద్రాలకు, చౌకదుకాణాలకు తరలిస్తున్నారు. ఈ కేంద్రాల్లో కందిపప్పు నిల్వలు లేవు. జిల్లాలో 6.43 లక్షల కార్డులకు ప్రతి నెలా 650 టన్నుల కందిపప్పు అవసరం. మార్చి నెలలో కేవలం 200 టన్నులు సరఫరా చేశారు. అది కూడా కార్డుదారుల దరి చేరలేదు. వచ్చే నెల పంపిణీకి ఇప్పటికే సరుకు జిల్లాకు చేరాల్సి ఉన్నా ఆ ప్రక్రియ జరిగిన దాఖలాలు లేవు. ఇప్పుడు ఈ-కేవైసీ పేరుతో మిగిలిన సరకులకు కూడా కోత పెడతారేమోనని కార్డుదారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

గడువు పెంచాలి



ఈ నెల 31లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలనే గడువు పెట్టడం సమజసం కాదు. ఈ గడువు పెంచాల్సిందే. రేషన్ దుకాణదారులు ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ మాత్రమే ఈ-కేవైసీ చేస్తున్నారు. పరీక్షల సమయం ఒకపక్క, వ్యవసాయ పనుల్లో మరోపక్క బిజీగా ఉండటంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఇప్పటికిప్పుడు తక్కువ సమయం ఇచ్చి ఈ-కేవైసీ చేయించుకోవాలని ఆదేశాలు జారీ చేయడం సరి కాదు.

– కర్రి ఉమామహేశ్వరరావు, సామర్లకోట

రేషన్ వ్యవస్థపై విషం



కూటమి ప్రభుత్వం గద్దెనెక్కినప్పటి నుంచీ రేషన్ వ్యవస్థపై విషం చిమ్ముతోంది. ముందుగా ఎండీయూ వాహనాలను తొలగిస్తామని భయపెట్టింది. తొమ్మిది మాసాలుగా ఏ నెలలోనూ కందిపప్పు ఇచ్చిన దాఖలాలు లేవు. ఏప్రిల్‌లోను కందిపప్పు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పుడేమో ఈ-కేవైసీ సాకుతో రేషన్‌లో కోత పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. రేషన్ డీలర్ల వద్ద రోజుకు రెండు గంటల పాటు మాత్రమే ఈ-కేవైసీ చేయించుకోవాలంటే ఇన్ని లక్షల మందికి ఎక్కడవుతుంది? కనీసంగా కూడా ఆలోచించకుండా తక్కువగా గడువు ఇవ్వడం అన్యాయం.

– పోకనాటి ప్రభాకరమూర్తి, విద్యా కమిటీ మాజీ చైర్మన్, వాకలపూడి, కాకినాడ రూరల్

ఉగాది వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు



కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. వేడుకల నిర్వహణపై కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సూర్య కళా మందిరంలో ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. వీటిని తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టి పడేలా ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. పంచాంగ శ్రవణం, వేదాశీర్వచనం, ఉగాది పచ్చడి, ప్రసాదాల ఏర్పాట్లను దేవదాయ శాఖ నిర్వహించాలన్నారు. వేదిక అలంకరణ బాధ్యతను ఉద్యాన శాఖకు, వేదికపై బ్యాక్‌డ్రాప్ ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణను సమాచార, పౌర సంబంధాల శాఖ చేపట్టాలన్నారు. అతిథులకు ఆహ్వానం, ఇతర ప్రొటోకాల్ బాధ్యతలను కాకినాడ ఆర్డీఓ చూడాలన్నారు. సమావేశంలో సమాచార, పౌర సంబంధాల శాఖ డీడీ డి.నాగార్జున, మెప్మా పీడీ బి.ప్రియంవద, హార్టికల్చర్ ఏడీ మల్లికార్జున, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కేటీ సుధాకర్, జిల్లా దేవదాయ శాఖ అధికారి సుబ్బారావు, ఆర్డీఓ ఎస్.మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల విరాళం

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో డోనార్ కాటేజీ స్కీముకు ఒక భక్తుడు రూ.10 లక్షల విరాళం సమర్పించారు. ఈ మేరకు దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావుకు చెక్కు అందించారు. ఈ విరాళాన్ని సత్యగిరిపై శివసదన్ సత్రంలోని 313 రూముకు కేటాయించాలని కోరారు. దాతకు లభించే గౌరవమర్యాదలు, సదుపాయాలు వర్తింపజేయాలని కోరారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఈఓ ఆదేశించారు.

నెలాఖరులోగా రైతు విశిష్ట సంఖ్య నమోదు పూర్తి



డైరీని ఆవిష్కరిస్తున్న విజయ్ కుమార్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రైతు విశిష్ట నమోదు కార్యక్రమాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సిబ్బందిని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.విజయ్ కుమార్ ఆదేశించారు. వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నూతన డైరీని శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు ప్రభుత్వ పథకాలు ఇకపై విశిష్ట సంఖ్య ద్వారానే అమలవుతాయన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవరావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి సతీష్, కోశాధికారి ఎం.నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థినితో మోకాళ్లు వేయించిన టీచర్

- స్పృహ కోల్పోయిన బాలిక
- చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యుల డిమాండ్



సామర్లకోట సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ

సామర్లకోట: పిల్లలు, విద్యార్థులు పొరపాటు చేస్తే వారికి నచ్చ చెప్పాల్సిన ఉపాధ్యాయులు అతి కిరాతకంగా వ్యవహరించిన వైనం ఇది. సామర్లకోట జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న బి.మహేశ్వరి చెవిదిద్దు ఊడిపోయి హిందీ ఉపాధ్యాయిని భారతీ లక్ష్మి కాలికి తగిలింది. దీంతో ఆగ్రహించిన ఉపాధ్యాయిని.. మహేశ్వరిని సుమారు గంటపాటు ఎండలో మోకాళ్లు వేయించింది. దీంతో బీపీ తగ్గిపోయి, మోకాళ్లు కొట్టుకుపోయి ఆ విద్యార్థిని స్పృహ కోల్పోయింది. సహచర విద్యార్థులు, స్థానికులు ఈ విషయాన్ని చర్చించుకోవడంతో సమీపంలో ఉన్న మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ఆమెను సీహెచ్‌సీకి తరలించారు. ఇంతలో సమాచారం అందుకున్న చిన్నారి తల్లిదండ్రులు, వారి బంధువైన కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ అక్కడకు చేరుకుని విద్యార్థినిపై క్రూరంగా వ్యవహరించిన హిందీ టీచర్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఉపాధ్యాయుల వల్లే ప్రభుత్వ పాఠశాలలకు చెడ్డ పేరు వస్తోందని అప్పలకొండ ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయినిపై చర్య తీసుకోకుంటే జిల్లా విద్యాశాఖాధికారి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఎంఈఓ వై.శివరామకృష్ణయ్యను వివరణ కోరగా విద్యార్థినిని మోకాళ్లు వేయించడంతో ఇంటికి వెళ్లిన తరువాత స్పృహ కోల్పోయిందని, దీంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకువెళ్లారని చెప్పారు. విద్యార్థులను మోకాళ్లు వేయడం సరికాదని, చిన్నారుల పట్ల సున్నితంగా వ్యవహరించాలని పదేపదే ఉపాధ్యాయులకు చెప్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకువెళ్తామని ఆయన వివరించారు.

10 వేల ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లు

- ప్రతి నియోజకవర్గంలో 2 వేల కిలో వాట్ల ఉత్పత్తి లక్ష్యం
- మంత్రి నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

కాకినాడ సిటీ: పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకం కింద జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో 10 వేల ఇళ్లపై 2 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. కాకినాడలో శుక్రవారం నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లా అభివృద్ధిపై కలెక్టర్ వివరించిన అంశాలు, వాటిపై ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ఆదేశాల అమలుపై ప్రజాప్రతినిధులు, అధికారులతో మంత్రి సమీక్షించారు. పీఎం సూర్యఘర్ పథకానికి జిల్లాలో ఇప్పటి వరకూ 5,086 దరఖాస్తులు అందగా 3,230 కిలోవాట్ల సామర్థ్యం మేరకు 890 యూనిట్లు నెలకొల్పారని వివరించారు. మిగిలిన లక్ష్య సాధనకు ఎనర్జీ అసిస్టెంట్లతో విస్తృతంగా అవగాహన కల్పించి, దరఖాస్తులను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయించాలని సూచించారు. ఇళ్లపై సోలార్ ప్యానళ్లు పెట్టేందుకు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఎస్సీ లబ్ధిదారుల యూనిట్లు ఏర్పాటు చేసి, వాటి ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను వారికి ఉచితంగా అందించాలని, ఇందుకు అనువైన భూములను గుర్తించాలని ఆదేశించారు. వేసవిలో వడగాడ్పులు, తాగునీటి ఎద్దడి నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించాలని సూచించారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ, జిల్లాలోని గ్రామీణ ఆవాసాల్లో 463, పట్టణ ఆవాసాల్లో 17 చలివేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.12.82 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.72 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని వివరించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద గ్రామాల్లో 1,484 వ్యక్తిత మరుగుదొడ్లు మంజూరు చేయగా, ఇప్పటి వరకూ 420 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. 134 కమ్యూనిటీ టాయిలెట్ల నిర్మాణం పూర్తయ్యి, మరో 49 నిర్మాణంలో ఉన్నాయన్నారు. పట్టణాల్లోని కమ్యూనిటీ మరుగుదొడ్లకు రూ.80 లక్షలతో మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని విస్తృతం చేసేందుకు జిల్లాలో 30 మందికి పైలట్ శిక్షణ ఇచ్చామన్నారు. 3.50 లక్షల పశువులకు అవసరమైన 25 లక్షల టన్నుల పశుగ్రాసం ఉత్పాదనకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

చెత్త తరలింపు కాంట్రాక్ట్‌కు టెండర్



'సాక్షి' ప్రచురించిన కథనం

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: రత్నగిరిపై చెత్త తరలింపు కాంట్రాక్ట్‌కు టెండర్ పిలిచి, తక్కువకు కోట్ చేసినవారికి ఇవ్వాలని అన్నవరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు అధికారులను ఆదేశించారు. 'రత్నగిరిపై చెత్త వివాదం' శీర్షికన 'సాక్షి' శుక్రవారం కథనం ప్రచురించింది. చెత్త తరలింపునకు నెలకు రూ.43 వేలకు దరఖాస్తు చేసిన వారికి కాకుండా.. ఎటువంటి టెండరూ పిలవకుండా నెలకు రూ.60 వేలకు మరొకరికి అవకాశం కల్పించడంపై వివాదం ఏర్పడిన విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన ఈఓ సుబ్బారావు పైవిధంగా ఆదేశించారు. తక్కువ మొత్తానికి కొటేషన్ దాఖలు చేసిన వారికి వారం రోజుల్లోగా టెండర్ ఖరారు చేయాలని పేర్కొన్నారు.

సత్యగిరిపై కొత్త సత్రం



మరమ్మతులు చేయనున్న సీతారామ సత్రం



సత్యగిరిపై నూతన సత్రం నిర్మించేదిక్కడే..

- 105 గదులతో నిర్మాణం
- రూ.11.40 కోట్ల వ్యయం
- త్వరలోనే టెండర్ల ఖరారు
- సీతారామ సత్రానికి మరమ్మతులు
- త్వరలో కమిషనర్ ఉత్తర్వులు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో సత్యగిరిపై రూ.11.40 కోట్ల వ్యయంతో, 105 గదులతో నూతన సత్రం నిర్మించాలని దేవదాయ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు కమిషనర్ కె.రామచంద్ర మోహన్ త్వరలోనే అన్నవరం దేవస్థానానికి ఉత్తర్వులు పంపనున్నారని తెలిసింది. దేవస్థానంలో ప్రస్తుతం ఉన్న 100 గదుల సీతారామ సత్రం శిథిలావస్థకు చేరడంతో దానిని పడగొట్టి ఆ స్థలంలోని సగ భాగంలో 4 అంతస్తుల్లో నూతన సత్రం నిర్మించాలని గత ఏడాది నిర్ణయించారు. ఆ మేరకు గత జనవరిలో టెండర్లు కూడా పిలిచారు. వీటి గడువు ముగిసి కూడా దాదాపు నెల రోజులైంది. వీటిని త్వరలోనే ఖరారు చేయాల్సి ఉంది. అయితే ఈ నెల మొదటి వారంలో దేవస్థానానికి వచ్చిన దేవదాయ శాఖ సాంకేతిక సలహాదారు పి.కొండలరావు, చీఫ్ ఇంజినీర్ జీవీ శేఖర్, సాంకేతిక కమిటీ సభ్యులు ఈ సత్రాన్ని పడగొట్టి కొత్త సత్రం నిర్మించే బదులు.. పాత భవనానికి మరమ్మతులు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. సత్రం బాగానే ఉందని, మరమ్మతులు చేస్తే కనీసం మరో మూడేళ్లు భక్తులకు అద్దెకు ఇవ్వవచ్చునని చెప్పారు. అదే రోజు సత్యగిరిపై నూతన సత్రం నిర్మించేందుకు గాను ఆగమ పాఠశాల ముందు, విష్ణు సదన్ సత్రం పక్కన ఉన్న స్థలాలను వారు పరిశీలించారు. ఇదే విషయాన్ని వారు దేవదాయ శాఖ కమిషనర్‌కు కూడా తెలియజేశారు. ఈ మేరకు కమిషనర్ రామచంద్ర మోహన్ ఈ నెల మూడో వారంలో అన్నవరం దేవస్థానం అధికారులతో విజయవాడలోని తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా సీతారామ సత్రం స్థలానికి బదులు ఆ నిధులతో సత్యగిరిపై నూతన సత్రం నిర్మించే అవకాశాలపై చర్చించారు.

అందరికీ ఉపయోగపడేలా..

సత్యగిరిపై విష్ణుసదన్‌లో 36 వివాహ మండపాలున్నాయి. ఇక్కడ వివాహాలు చేసుకునే పెళ్లిబృందాల వారికి అక్కడికి కాస్త దూరంలో ఉన్న హరిహర సదన్ సత్రంలో గదులు కేటాయిస్తున్నారు. విష్ణు సదన్ సత్రం పక్కన, ఆగమ పాఠశాల ముందున్న స్థలంలో 105 గదులతో నూతన సత్రం నిర్మిస్తే వివాహ బృందాల వారికి, భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందని, ఆ మేరకు ఇక్కడే నిర్మించాలని నిర్ణయించారని సమాచారం. నూతన సత్రం నిర్మాణానికి గత జనవరిలో టెండర్లు పిలవగా 12 మంది కొటేషన్లు దాఖలు చేశారు. ఈ సత్రం గ్రౌండ్ ఫ్లోర్ అంతా వాహనాల పార్కింగ్‌కు వదిలేస్తారు. మొదటి, రెండు, మూడు ఫ్లోర్లలో ఫ్లోర్‌కు 35 చొప్పున 105 గదులు నిర్మించాలని ప్రతిపాదించారు. సీతారామ సత్రం వద్ద ఎంత స్థలంలో నిర్మించాలని ప్రతిపాదించారో అంతే విస్తీర్ణంలో సత్యగిరిపై సత్రం నిర్మించే అవకాశం ఉంది. కమిషనర్ నుంచి పూర్తి స్థాయిలో ఆదేశాలు వచ్చిన తరువాత సీతారామ సత్రం మరమ్మతులపై నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు.

సత్యదేవునికి రూ.1.19 కోట్ల హుండీ ఆదాయం



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం: సత్యదేవునికి హుండీల ద్వారా గత 25 రోజులకు గాను రూ.1,19,10,877 ఆదాయం వచ్చింది. అన్నవరం దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. నగదు రూ.1,11,50,975, చిల్లర నాణేలు రూ.7,59,902 వచ్చాయని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు తెలిపారు. వీటితో పాటు బంగారం 25.800 గ్రాములు, వెండి 512 గ్రాములు వచ్చాయన్నారు. రోజుకు సరాసరిన రూ.4,76,435 హుండీ ఆదాయం వచ్చిందని చెప్పారు. హుండీల ద్వారా అమెరికా డాలర్లు 46, సౌదీ సెంట్రల్ బ్యాంక్ రియల్స్ 5, ఆస్ట్రేలియా డాలర్లు 20, యూఏఈ దీరామ్స్ 105, యూరోలు 60, మలేషియా రింగిట్స్ 15 లభించాయి. కార్యక్రమంలో చైర్మన్, ఈఓలతో పాటు శ్రీవారి సేవ, శ్రీహరి సేవ తదితర స్వచ్ఛంద సేవా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు. హుండీల్లో వచ్చిన నగదును స్థానిక స్టేట్ బ్యాంకుకు తరలించారు.

పట్టు వస్త్రాల సమర్పణ

అన్నవరం: వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి విశాఖపట్నానికి చెందిన లక్కీ షోరూమ్ అధినేతలు శ్రీనివాసరావు, దత్తయ్య శుక్రవారం రూ.లక్ష విలువైన పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుడు, ఉపాలయాల్లోని దేవతామూర్తులకు వీటిని అలంకరించాలని కోరారు. అలాగే ఏప్రిల్ 6న జరగనున్న శ్రీరామ నవమి వేడుకల్లో సీతారాములకు విశాఖపట్నానికి చెందిన మల్లెల వీర రాఘవరావు, తూర్పు గోదావరి జిల్లా దువ్వ గ్రామానికి చెందిన కాశీ రూ.50 వేల విలువైన పట్టు వస్త్రాలు, రుత్విక్కులకు దీక్షా వస్త్రాలు సమర్పించారు. వీటిని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావుకు అందజేశారు.

క్లుప్తంగా


దేవదానంరాజుకు కళారత్న పురస్కారం



యానాం: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కళా రత్న (హంస) పురస్కారాన్ని యానాంకు చెందిన ప్రముఖకవి, కథకుడు దాట్ల దేవదానంరాజుకు అందజేస్తున్నట్లు శుక్రవారం సాంస్కృతి కశాఖ డైరెక్టర్, కన్వీనర్ ఆర్ మల్లిఖార్జున రావు ప్రకటనలో తెలిపారు. కళారత్న పురస్కారంతో పాటు రూ.50వేల నగదు, హంస ప్రతిమ, సర్టిఫికెట్, శాలువాతో సత్క రిస్తారని తెలిపారు. విశ్వావసు ఉగాది వేడు కల సందర్భంగా ఆదివారం జరిగే ప్రత్యేక సభలో సీఎం నారా చంద్రాబాబు నాయుడు చేతుల మీదుగా తుమ్మలపల్లి క్షేత్రంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. కథకు డిగా, కవిగా, విమర్శ కుడిగా, చరిత్రకారు నిగా సాహిత్యంలో విశేషకృషి చేస్తున్న దాట్ల దేవదానంరాజు పురస్కారం స్వీకరిస్తున్నం దున పలువురు ఆయనను అభినందించారు. గతంలో పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి కలై మామాణి, తెలుగురత్న పురస్కారాలను ఆయన అందుకున్నారు. జిల్లా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందారు. వానరాని కాలం, గుండె తెరచాప, మట్టి కాళ్లు, లోపలి దీపం, నది చుట్టూ నేను, పాతం పూర్తయ్యాక, దోసిలిలో నది 7 కవితా సంపుటాలు, ముద్ర బల్ల, నాలుగో పాదం రెండు దీర్ఘ కవితలు, దాట్ల దేవదా నంరాజు కథలు, యానాం కథలు, కల్యాణ పురం, కథల గోదారి, యానాం చరిత్ర, సరదాగా కాసేపు, చైనా యానాం యాత్రా కథనం, మధుహాసం, చమత్కారాలు పుస్తకా లను వెలువరించారు. అంతే కాకుండా డాక్టర్ పరుచూరి రాజారాం పురస్కారం, గుంటూరు జిల్లా రచయితల పురస్కారా లను ఆయన పొందారు. తమిళ, మళయాళ, ఇంగ్లిషు భాషల్లోకి ఆయన రచనలు అను వాదం కావడంతో పాటు డానియేల్ నేజర్స్ యానాం కథల్ని ఫ్రెంచిలోకి అనువదిం చారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి శిఖామణి దాట్లను అభినందించారు.

కల్పవల్లి.. నూకాలమ్మ తల్లి

- వైభవంగా జాతర ప్రారంభం
- కొత్తపూల ఉత్సవాల్లో గరగ నృత్యాలు
- మండపంలో ఆకట్టుకున్న శిల్పకళ


చింతలూరులో కొలువైన నూకాంబిక అమ్మవారు

ఆలమూరు: బాలారిష్ట నివారిణీ, చల్లని చూపుల తల్లి, కోరిన కోర్కెలు నెర వేర్చి, చింతలు తీర్చే కల్పవల్లి, ఆరోగ్య ప్రదాయని చింతలూరి వంశస్తుల ఆడపడుచుగా నూకాంబిక అమ్మవారికి ప్రసిద్ధి. యేటా మాదిరి గానే పాల్గుణ శుద్ధ త్రయోదశి అంటే గురువారం రాత్రి నుంచి జాతర, తీర్థ మహోత్స వాలు ప్రారంభమయ్యాయి. కోస్తా జిల్లాలకే తలమా నికమైన ఈ ఆలయంలోని అమ్మవారి దర్శనానికి ఈ ఏడాది సుమారు 20 లక్షల మంది భక్తులు వస్తారని దేవదాయశాఖ అంచనా వేస్తుంది. పవిత్ర గౌతమీ గోదావరి తీరాన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లాలోని ఆలమూరు మండలం చింతలూ రులో కొలువైన అమ్మవారి ఆలయానికి రెండున్నర


అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న గరగ నృత్యాలు

శతాబ్దాల చరిత్ర ఉంది. ఇటీవల సుమారు రూ. మూడు కోట్లతో అభివృద్ధి చేసిన ఆలయంలో శిల్ప కళా నైపుణ్యం ఉట్టిపడుతోంది. చింతలూరు గ్రామ శివారులో ఉన్న పాలచెట్టు తొర్రలో లభించిన అమ్మవారి విగ్రహాన్ని అప్పటి పిఠాపురం మహారాజు సహకారంతో ప్రతిష్ఠించినట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. ముఖ్యంగా చంటిపిల్లల పాలిట అమృతవల్లిగా, సకల పాపాలు హరించే మాతృమూ ర్తిగా అమ్మవారు విరాజిల్లుతోంది. అమ్మవారికి చిన్నారులతో కాగడాలు వెలిగించి వారకల్లు, తుళ్ల బిళ్ల దిష్టి తీయిస్తే తట్టు, పొంగు, ఆటలమ్మ వంటి అంటు వ్యాధులు సోకవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో పరిసర ప్రాంతాల భక్తుల బంధుగణం దేశం లో ఎక్కడ ఉన్నా సరే అమ్మవారి జాతరకు వచ్చి వారి పిల్లల చేత కాగడాలు వెలిగించడం ఆనవాయి తీగా వస్తోంది. అమ్మవారిని నెలరోజుల ముందు నుంచే మండలంలోని అన్ని గ్రామాల్లో బుట్టగరగ రూపంలో ఇప్పటికే ప్రజలకు దర్శనమిచ్చింది.

మోదుగు పూల గరగ ప్రత్యేక ఆకర్షణ

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మరే ప్రాంతంలో లేని విధంగా అమ్మవారి పూల (గరగ) ఘటానికి పక్షం రోజుల ముందు నుంచే కొత్త, పాత పూల ఉత్సవా లను నిర్వహిస్తారు. ఈ పూలను రోజు విడిచి రోజు మన్య సీమ నుంచి తీసు కువచ్చిన మోదుగు పూలతో అలంక రిస్తారు. ఈ గరగను నెత్తిన ధరించిన నృత్య కళాకారుడిచే చంటి పిల్లలను దాటిస్తే ఏ విధమైన రోగాలు దరిచేరవని భక్తుల విశ్వాసం. దీంతో పరిసర ప్రాంతాల నుంచి అనేక మంది చిన్నారుల తల్లిదం డ్రులు కొత్తపూల ఉత్సవాలను తిలకించి భక్తి పార వశ్యం చెందారు. ఈనెల 28న అమ్మవారి జాతర మహోత్సవాలు పూర్తికాగా ఆలయ ఆసాదులు చేప ట్టిన గరగ నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకు న్నాయి. 29న జరిగే తీర్థం రోజున గవ్వ నృత్యం, 30వ తేదీ ఉగాది నాడు నిర్వహించే 'బద్ది కడుగుట' కార్యక్రమంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేం దుకు దేవదాయశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది.


మోదుగ పూల గరగ

బస్సు ఢీకొని జంగమ దేవర మృతి


ప్రమాదంలో మృతి చెందిన ఏడుకొండలు

మామిడికుదురు: మామిడికుదురు 216వ జాతీయ రహదారిపై ఎస్‌బీఐ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామంలోని జంగాలపుంత (గన్నేరు రోడ్డు)కు చెందిన జంగమ దేవర ఇంగువ ఏడుకొండలు (48) మృత్యువాత పడ్డారు. మోటార్ సైకిల్‌పై ఏడుకొండలు పాశర్లపూడి వైపు వెళ్తుండగా పాలకొల్లు నుంచి అప్పనపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక భాగం మోటార్ సైకిల్‌కు తగిలి ఏడుకొం డలు వెనుక చక్రం కింద పడిపోయాడు. అతని తలపై నుంచి బస్సు చక్రం వెళ్లడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందారు. ఏడుకొండలు మృ తితో అతని భార్య వరలక్ష్మి, కొడుకు లక్ష్మణరావు, వారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విల పించారు. నగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఏసీబీ వలలో జిల్లా రిజిస్ట్రార్


ఏసీబీకి చిక్కిన జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ప్రైవేటు వ్యక్తి వెలుగుల జగదీష్


జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు కారులో స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, నగదు

- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్, ప్రైవేటు వ్యక్తి
- రూ.1.25 లక్షల స్వాధీనం
- రిజిస్ట్రార్ కారులో 13 మద్యం సీసాలు, రూ.7,87,200 నగదు
- కొనసాగుతున్న దాడులు

కాకినాడ లీగల్: రూ.లక్ష లంచం తీసుకుంటూ కాకి నాడ జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావు, రూ.25 వేల లం చం తీసుకుంటూ అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కేవీ శ్రీనివాసరెడ్డి శుక్ర వారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ కిశోర్‌బాబు కథనం ప్రకారం.. కాకి నాడ జిల్లా తుని పట్టణా నికి చెందిన ఆర్.ర మేష్‌బాబు భార్య పేరిట సమంత గ్యాస్ ఏజెన్సీ ఉంది. దీనిలో భార్య పేరుతో పాటు ఫర్మ్ రిజి స్ట్రేషన్ తన పేరు మీద కూడా మార్చాలని ఆయన జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావును ఆశ్రయిం చారు. ఆ పని చేసేందుకు ఆయన రూ.లక్ష, సీనియర్ అసిస్టెంట్ శ్రీని వాసరెడ్డి రూ.25 వేల చొప్పున లంచం డిమాం డ్ చేశారు. దీంతో రమే ష్‌బాబు ఏసీబీని ఆశ్ర యించారు. దీంతో ఏసీబీ అధికారులు రెండు రోజులుగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిఘా పెట్టారు. ముందుగా సిద్ధం చేసిన ప్రణాళిక ప్రకారం.. జిల్లా రిజిస్ట్రార్‌కు, సీనియర్ అసిస్టెంట్‌కు రమేష్‌బాబు లంచం ఇస్తూండగా ఏసీబీ అధికారులు హఠాత్తుగా దాడి చేసి వారిని, అక్కడే ఉన్న ప్రైవేటు వ్యక్తి వెలుగుల జగదీష్‌ను రెడ్‌హ్యాండె డ్‌గా పట్టుకుని, అదుపులోకి తీసుకున్నారు. కక్షిదారుల నుంచి జగదీష్ లంచం సొమ్ము తీసుకుని ఇస్తూం టాడు. ఆనందరావు నుంచి రూ.లక్ష, శ్రీనివాసరెడ్డి నుంచి రూ.25 వేలతో పాటు, జిల్లా రిజిస్ట్రార్ చాంబ ర్‌లో అనధికారికంగా ఉన్న మరో రూ.88 వేల నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆనందరావు కారులో 13 మద్యం సీసాలు, మరో 7,87,200 నగదును ఏసీబీ అధికారులు స్వా ధీనం చేసుకున్నారు. మద్యం సీసాలను ఎక్సైజ్ అధికా రులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయను న్నారు. అలాగే ఆనందరావు ఇంట్లో ఏసీబీ దాడులు కొనసాగుతున్నాయి. ఈ దాడుల్లో ఏసీబీ అధికారులు ప్రభాకర్, సతీష్, వాసుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి కాదు.. అమ్మ ఒడి

- కంటికి రెప్పలా కాచుకున్నారు
- కుటుంబ సభ్యుల్లా వైద్యులు, సిబ్బంది
- జీజీహెచ్‌లో తమ కుమారుడికి అందిన వైద్య సేవలపై తల్లిదండ్రుల హర్షం


తన కుమారుడికి వైద్యం అందించిన డాక్టర్ సూర్యకాంత్‌కు ధన్యవాదాలు చెబుతున్న వెంకటలక్ష్మి

కాకినాడ క్రైం: '' కళ్లు తేలేశాడు.. నిస్సత్తువతో కుప్ప కూలిపోయాడు.. ఒళ్లు కాలిపోతోంది. తింటే వాం తులు, తినకపోతే నీరసం, ముద్ద ముట్టి ఐదు రోజు లైంది.. ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళితే పరిస్థితి ఆం దోళనకరమేని చేతులెత్తేశారు. అయిష్టంగానే మరో మార్గం లేక జీజీహెచ్‌కి తీసుకువచ్చారు. బిడ్డడు తేరుకున్నాడు. ఆ తల్లిదండ్రులు ఆనందబాష్పా లతో వైద్యులకు చేతులెత్తి దండాలు పెట్టి తమ బిడ్డని అమ్మ ఒడిలాంటి ఆస్పత్రికి తీసుకువచ్చామ ని, రక్షించినది వైద్యులు కాదని కుటుంబ సభ్యులని హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఆ బిడ్డ తల్లిదం డ్రులైన ఉపాధ్యాయ దంపతులు తమ ఆనందాన్ని కుమారుడితో కలిసి కాకినాడ జీజీహెచ్ సూపరిం టెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, వైద్యుల సమక్షం లో శుక్రవారం విలేకరులతో పంచుకున్నారు.

పెదపూడి మండలం రామేశ్వరం గ్రామానికి చెం దిన 21 ఏళ్ల శ్రీపాద సూర్యతేజ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అతడి తల్లిదండ్రులు రామకృష్ణ, వెంకటలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయులు. రామకృష్ణ కరప మం డలం పెద కొత్తూరు, మండల పరిషత్ ఎలిమెంటరీ స్కూల్ టీచరు కాగా, వెంకట లక్ష్మి పెదపూడి మం డలం కరకుదురు జెడ్పీ హైస్కూల్ టీచరు. సూర్యతేజ కొద్ది రోజుల క్రితం తీవ్ర జ్వరం, వాం తులు, నిస్సత్తువ ఆవరించి అచేతన స్థితికి చేరు కున్నాడు. నానాటికీ క్షీణిస్తున్న అతడి పరిస్థితిని చూసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించినా ఫలితం లేకపోయిం ది. చివరికి గత నెల 23వ తేదీన కాకినాడ జీజీ హెచ్‌లో చేర్చారు. అత్యవసర విభాగంలో వైద్యులు అతడిని అత్యవసర విభాగంలో చేర్చి రక్త పరీక్షలు చేశారు. నివేదిక వచ్చేలోగా వైద్య విభాగం ఎం1 వార్డులో చేర్చారు. అప్పటి నుంచి జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ యశోదమ్మ ఆధ్వర్యంలో అసిస్టెం ట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ అత్తిలి సూర్యకాంత్, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ కిరణ్ పర్యవేక్షణలో వైద్యం చేస్తున్నారు. ఖరీదైన మందులు వినియోగించినట్లు డాక్టర్ యశోదమ్మ చెప్పగా, డాక్టర్ సూర్యకాంత్ తల్లిదండ్రులకు ఫోన్ నంబర్ ఇచ్చి ఏ సమయం లోనైనా పిలవండని హామీ ఇచ్చి అర్ధరాత్రి వేళల్లో సైతం చికిత్సకు హాజరైన సందర్భాలు ఉన్నాయ న్నారు. నాలుగు రోజులు శ్రమించి సూర్యతేజను లెప్టోస్పైరా, హెపటైటిస్-ఏ ముప్పు నుంచి గట్టె క్కించామన్నారు. ఈ స్థితి పలుమార్లు ప్రాణా పాయానికి కూడ దారి తీస్తుందని వెల్లడించారు. సూర్యతేజ తల్లిదండ్రులు మాట్లాడుతూ నిస్సత్తు వతో వచ్చిన తన కుమారుడు నడుచుకుంటూ ఇం టికి వెళ్లాడని అన్నారు. ఆసుపత్రిలో వైద్యులు, నర్సింగ్ వైద్యేతర సిబ్బంది అందిస్తున్న సేవలు వెల కట్టలేనివని కొనియాడారు. వార్డుల్లో చక్కటి పారి శుద్ధ్య నిర్వహణ తమ బిడ్డ కోలుకోవడానికి ఎంతో దోహదపడిందని తెలిపారు. తన బిడ్డను కంటికి రెప్పలా కాచుకున్నారని భావోద్వేగానికి గురయ్యారు వెంకటలక్ష్మి. డాక్టర్ లావణ్యకుమారి, యశోదమ్మ, డాక్టర్ సూర్యకాంత్‌లకు నమస్కరించి తన కృతజ్ఞతను చాటుకున్నారు. జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ యశోదమ్మ మాట్లాడుతూ, సూపరింటెండెంట్ చొరవతో ఖరీదైన మందులు వినియోగించి చక్కటి వైద్య సేవలు అందించగలిగామన్నారు. డాక్టర్ సూర్యకాంత్ సహా తమ బృందం అహర్నిశలు శ్రమించిందని యశోదమ్మ తెలిపారు. డాక్టర్ లావ ణ్యకుమారి మాట్లాడుతూ, తమ బిడ్డకు కాకినాడ జీజీహెచ్‌లో మెరుగైన వైద్య సేవలు పొందిన తల్లిదండ్రులు ఆ విషయాన్ని నలుగురికీ తెలియజే యాలని సంకల్పించి నిష్ణాతులైన వైద్యుల సమక్షం లో నాణ్యమైన వైద్య సేవలు జీజీహెచ్‌లో అంది స్తున్నట్లు తెలిపారు. చికిత్సలో పీజీ డాక్టర్ కీర్తన సహా జూనియర్ వైద్యులు రవితేజ, ఎలైజా కీలకం గా వ్యవహరించారన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, డీసీఎస్ఆర్ ఎంవో డాక్టర్ రాజకుమారి, ఏవో శర్మ, సీనియర్ అసిస్టెంట్ వెంకట కృష్ణ పాల్గొన్నారు.

ఆడుకుంటూ.. అనంతలోకాలకు..

కాలువలో పడి చిన్నారి మృతి


చింతపల్లి కాలువలో అనూష మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సుమంత్, పోలీసులు


అనూష (ఫైల్)

పెదపూడి: అనపర్తి మండలం కొప్పవరంలోని నల్ల కాలు వలో చిన్నారి ప్రమాదవశాత్తూ పడి మృతి చెందినట్లు ఏఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం తెలి పిన వివరాల మేరకు కొప్పవరంలోని నల్ల కాలువ గట్టుపై మచ్చ దొరబాబు నివసిస్తూ తాపీపని చేస్తుంటాడు. అతనికి కుమార్తె అనూష భార్గవి(4), కొడుకు ఉన్నారు. రోజులానే దొరబాబు ఉదయం తాపీ పనికి వెళ్లాడు. తల్లి కూతురు, కొడుకుతో ఇంటి వద్ద ఉంది. అనుష 10 గంటల సమయం లో ఆడుకుంటూ కొంత సేప టికి కనిపించలేదు. ఆం దోళనకు గురైన తల్లి వెంటనే దొరబాబుకు విషయం చెప్పింది. అతడు వెంటనే ఇంటికి వచ్చి బంధువుల సాయంతో పరిసరాల్లో వెదికినా ఫలితం లేకపోయింది. దొరబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాలువ గట్టుపై వారు వెతుకు తుండగా పెదపూడి మండలం చింతపల్లి గ్రామంలోని కాలు వలో రేవు వద్ద చిన్నారి మృతదేహాన్ని కనుగొన్నారు. సీఐ వీఎల్‌వీకే సుమంత్ ఘటన స్థలానికి చేరుకుని చిన్నారిని పరి శీలించి వివరాలు సేకరించారు. అనంతరం చిన్నారి మృతదే హాన్ని అనపర్తిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు.

పాము కాట్లకు ఇద్దరి మృతి


పాము కాటుతో మృతి చెందిన శృతిప్రియ

మామిడికుదురు/ముమ్మిడివరం: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం పాము కాట్లకు గురై ఇద్దరు మృతి చెందారు. మామిడికుదురు మం డలం ఆదుర్రు గ్రామంలో శుక్రవారం కంచి శృ తిప్రియ (24) ఇంటి బయట ఉన్న బట్టలు తీస్తుం డగా బట్టల్లో దాగి ఉన్న పాము ఆమె చేతిపై కాటు వేసింది. స్థానికులు ఆమెను వెంటనే రాజోలు ప్రభు త్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. యువతి తండ్రి మోహనరావు తాపీమేస్త్రి, తల్లి మంగాదేవి ఉపాధి కోసం కువైట్ వెళ్లారు. ఇద్దరు కుమార్తెల్లో పెద్ద అమ్మాయికి వివా హమైంది. రెండో కుమార్తె శృతిప్రియ మృతితో ఆమె కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విల పించారు. ఆమె బీఎస్సీ చదువుకుంది. ఆమె కుటుం బ సభ్యుల ఫిర్యాదు మేరకు నగరం ఎస్సై ఎ.చై తన్యకుమార్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ కేఎస్ ప్రసాద్ కేసు దర్యాప్తు చేపట్టారు.

అలాగే ముమ్మిడివరం మండలం అయినా పురం రామారావు పేటకు చెందిన దోనిపాటి వెం కటేశ్వరరావు (44) ఒక రైతు పొలంలో కొబ్బరికా యలు పోగుచేస్తుండగా పాము కాటు వేసింది. దీం తో అతడు అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. అతడిని స్థానికులు ముమ్మిడివరం ఆస్పత్రికి తర లించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. అతనికి భార్య కనకలక్ష్మి, ఇద్దరు కుమా రులు ఉన్నారు. స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ జీబీ స్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఖోఖో శిబిరం


పూరీలో జరిగే జాతీయస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొననున్న రాష్ట్ర జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్ర ఖోఖో సంఘం సహకారంతో జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో పది రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి బాలికల ఖోఖో శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. స్థానిక జేఎన్టీయూకే క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిబిరం ముగింపునకు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, జేఎన్టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి, పీడీ జి.శ్యాంకుమార్ అతిథులుగా హాజరై జాతీయస్థాయి పోటీ లలో రాణించి పతకాలు సాధించాలన్నారు. జిల్లా ఖోఖో సంఘ కార్యదర్శి, శిబిరం నిర్వాహకులు, పీడీ పట్టాభి మాట్లాడుతూ ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు ఒడిశా రాష్ట్రం పూరిలో జరిగే 57వ ఆలిండియా పురుషులు, మహిళల ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేశామన్నారు. ఇటీవల జరిగిన సవిల్ సర్వీస్ ఖోఖో పోటీలలో రజత పతకం సాధించిన పీడీలు ఎండీ ఇబ్రహీం, కిరణ్ కుమార్ లను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీడీలు మహబూబ్ బాషా, శ్రీనివాస్ పాల్గొ న్నారు. రాష్ట్ర జట్టుకు కోచ్‌గా వాసు, మేనేజర్‌గా జి.పావని వ్యవహరిస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యకు కారకులైన
ముగ్గురి అరెస్టు

- నిందితులు భార్య, ఆమె ప్రియుడు, అతడి తండ్రి
- కోర్టుకు తరలించిన పోలీసులు


మృతి చెందిన చల్లా దుర్గారావు (ఫైల్)

పెరవలి: భార్య వివాహేతర సంబంధంతో జీవితం పై విరక్తి చెంది కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న యువకుడి కేసులో ముగ్గురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్ఐ ఎం.వెంకటేశ్వర రావు తెలిపిన వివరాల మేరకు మండలం ఖండవ ల్లి గ్రామానికి చెందిన చల్లా దుర్గారావు (29) ఈ నెల 25 వ తేదీన పెరవలి లాకుల వద్ద మోటార్ సైకిల్ వదలి కాల్వలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడి 26వ తేదీన ఇరగవరం మండలం రాపాక వద్ద శవమై తేలిన విషయం తెలిసిందే. అతడు రాసిన సూసైడ్ నోట్ ప్రకారం తన చావుకు కారణమైన ఖండవల్లి గ్రామానికి చెందిన మోత్రపు అమోఘ్, మోత్రపు శివ ప్రసాద్, మృతుడి భార్య చల్లా దివ్య కుమారి కారణమని పేర్కొన్నాడు. ఫిర్యాదుదారు చల్లా వెంకట సుబ్బారావు ఇచ్చిన వివరాలు, గ్రామ పెద్దల సమాచారం, సాంకేతిక ఆధారాల మేరకు వారి ముగ్గురిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచినట్టు తెలి పారు. తన భార్య అదే గ్రామానికి చెందిన మోత్రపు అమోఘ్‌తో వివాహేతర సంబం ధం పెట్టుకున్న విషయాన్ని దుర్గారావు, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ పెద్దలు అమోఘ్‌ను ఇం టికి వెళ్లి నిలదీశారు. దీంతో అతడితో పాటు తండ్రి శివప్రసాద్‌లు దుర్గారావును దుర్భాషలాడి అవమానించారు. దీంతో అతడు మనస్తాపం చెంది తన చావుకు వారు ముగ్గురే కారణమని, తాను దుబాయి వెళ్లి సంపాదించినదంతా దివ్యకుమారి ప్రియుడికి దోచిపెట్టిందని, దీంతో తాను ఆర్థికంగా చితికిపోయానని, వివాహేతర సంబంధంతో తీవ్ర మనస్తాపం చెందానని సూసైడ్ నోట్ రాసి కాల్వ లోకి దూకాడు. నిందితులను రిమాండ్ నిమిత్తం తణుకు కోర్టులో శుక్రవారం హాజరు పరిచినట్టు ఎస్సై తెలిపారు.